# ఊబి

పాలకోడేటి సత్యనారాయణరావు

స్ప్రింగ్ డోర్ తోసుకొని లోపలకు వచ్చిన కుముదకు అక్కడ ప్రపంచం అంతా క్రొత్తగా వింతగా తోచింది. దాదాపు ఓ ఇరవై టేబిళ్ళు, టేబిల్ చుట్టూ మనుషులు, టేబిల్ మధ్యలో రంగురంగుల సీసాల్లో రంగురంగుల ద్రవాలు, ప్లేట్లలో ఏవేవో తినుబండారాలు—ఇదంతా కనీకనిపించని విధంగా ఉండే చీకటి వెలుగుల కలయిక. దూరంగా పెద్ద అలమారు. అలమారు నిండా సీసాలు. సీసాలకు ముందు, ముందు టేబిల్‌కు వెనుక మధ్య ఖాళీ స్థలంలో పని చేసుకొంటున్న ఓ ఇద్దరు మనుషులు. ఉన్న గోలకు తోడుగా కొంచెం హెచ్చు స్వరంలోనే ఏదో ఇంగ్లీషు ట్యూన్ వినిపిస్తున్న స్టీరియో సిస్టమ్.

కుముదకు అక్కడ అందర్నీ చూస్తోంటే తమాషాగా అనిపించింది—ఇందరు... ఇందరు తాగుబోతులా దేశంలో అనుకొంది క్షణంపాటు. వెంటనే తన అంచనా తప్పు అని తెలుసుకొంది. ఇది కేవలం ఈ ఒక్క బార్‌లోనే! ఇలాటి బార్‌లు వీధికి ఎన్నో—అలాటి వీధులు ఊరికెన్నో ... లెక్క పెట్టుకోవటం కష్టం. ఊహించుకోవటం తెలివి తక్కువ.

కుముద అక్కడే నిలబడి ఆలోచనల్లో పడటం గమనించాడు సుందరరావు.

"రా, లోపలికి!" అన్నాడు సుందరరావు ఎవరికీ వినిపించనంత నెమ్మదిగా.

కుముద ముందుకు నడిచింది—ఆమె ఆలోచనలు మాత్రం వెనుకటి సంగతుల్ని తోడుతున్నాయి—...ఇందరు తాగుబోతుల్నీ తలో భార్య భరిస్తోందన్న మాటే గదా! అంటే... భర్త అంటున్నట్లు ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకో నక్కర్లేదన్నమాట!!

కానీ—అలా అనుకోగలిగే సంగతి కాదు. తాగుడువల్ల ఎన్ని కష్టాలున్నాయో, నష్టాలున్నాయో తనకు ఎవరూ చెప్పనక్కర్లేదు. భర్త సంగతీ అంతే - ఆయనకు తెలీని సంగతా అది? జేబులో పక్క ఖాళీ అవుతున్న సంగతి ఎప్పటికప్పుడు పర్సు చెబుతున్నా పట్టించుకోవటం లేదంటే ... అది తెలిసి చేస్తున్న సంగతే అనేది స్పష్టం. పోనీ జేబుమీద ధ్యాస ఉండకపోవచ్చు కానీ ఆరోగ్యం సంగతేమిటి? అప్పుడప్పుడు కడుపునొప్పి అనుకోవటం, ఒక్కోరోజు తెల్లవారగానే హేంగోవర్‌తో తలనొప్పి రావటం—వీటి సంగతి ఎలా మర్చిపోవటం??

—తెలియదనుకోవటం ఆత్మ వంచన.

పట్టించుకోకపోవటం దౌర్భాగ్యం.

"కుముదా....!" అన్నాడు సుందరరావు నెమ్మదిగా.

ఆలోచనల్లోంచి తేరుకొంటూ భర్తకేసి








చూసింది.

"చెప్పు. ఏం తీసుకొంటావో?" అన్నాడు భర్త.

కుముదకు నవ్వొచ్చింది చిన్నగా నవ్వుతూ అంది—"నేను తీసుకోవటం ఏమిటి, ఏం తీసుకొంటారో మీరు నిర్ణయించుకోవాలి!"

సుందరరావు నవ్వాడు — "బార్‌కు వస్తానని ఊ సంబరపడ్డావు కదా! ఏదైనా తాగుతావేమోనని అడుగుతున్నా!"

కుముద నెమ్మదిగా అంది—"బార్‌కు వస్తానన్నది తాగటానికి కాదు. మిమ్మల్నిక్కడ అంతగా కట్టి పడేస్తున్నదేమిటో తెలుసుకొందామనే కాంక్షతో—తెలిసిందా?"

"చెప్తున్నావుగా, తెలీకుండా ఎలా ఉంటుందిలే!" అన్నాడు సుందరరావు.

"నాకు ఇక్కడ ఏమీ కనపట్టంలేదు—ఎందుకింతగా దీనికోసం పడి చచ్చిపోవటమో అర్థం కావటంలేదు. తెగతాగి ఒళ్ళంతా గుల్ల చేసుకోవటం తప్పిస్తే....!"

"కుముదా — ఇదిగో, ఈ న్యూసెన్స్ ఇక్కడా మొదలెట్టకు. బార్‌కు వచ్చి, హితోపదేశాలు చేసేటట్టయితే కుదరదని ముందే చెప్పాను!" అన్నాడు సుందరరావు.

—నిజమే, సుందరరావు ఇంటి దగ్గరే ఎన్నో చెప్పాడు. బార్‌కు రావద్దని మొదట నచ్చచెప్పబోయాడు. 'అక్కడ అందరూ

వెధవలుంటారు, నువ్వు రావద్దు' అన్నాడు. 'మరి అందరూ వెధవలుండేచోటికి మీరెందుకు?' అనడిగింది తను. సుందరరావుదగ్గర ఆ ప్రశ్నకు జవాబు లేకపోయింది. క్షణం ఊరుకొన్నాడు. అయినా ఆపే ప్రయత్నాలు మాత్రం మానుకో లేదు. 'అక్కడింకా మాంసం, అదీ తింటారు' అన్నాడు. 'సర్లెండి, మద్యం విషయంలోనే నాకు పట్టింపు లేదంటే ఇక మాంసం విష యంలో ఉంటుందా?' అనేసింది తను. 'మరి, నేను తింటూంటే పెద్దగా పట్టించుకోకూడదు - అది తింటారా? ఇది తింటారా మీరు అని ఆశ్చర్యపోకూడదు!'—'సరే, మీరెలా అంటే అలాగే!' ఒప్పుకొంది. 'చివర్న యింకో షరతు. అక్కడకొచ్చి హితోపదేశం చెయ్య కూడదు. తాగి ఆరోగ్యం పాడు చేసుకోవద్దు. డబ్బులు ఖర్చు పెట్టొద్దు అంటూ యిలాటి నీతివాక్యాలు చెప్పి నా మూడ్ పాడు చెయ్య కూడదు. సరేనా?'—దానికీ ఒప్పుకొంది.

అప్పుడు సుందరరావుకు యిక తప్పింది కాదు. ఈ వేళ అనీ, రేపనీ ఓ వారం పది రోజులు వాయిదా వేశాడు. అయినా కుముద పట్టు పట్టేసరికి ముహూర్తం ఈవేళ్టికి ఫిక్సయింది.

బేరర్ వచ్చాడు. కుముదకు సుందరరావు ఏం ఆర్డరిచ్చాడో అర్థం కాలేదు. కానీ తన కోసం చిప్స్ వస్తున్నాయని తెలిసింది. బేరర్ అటు వెళ్ళగానే మళ్ళీ సుందరరావే అడిగాడు - "పోనీ ఏదైనా సాఫ్ట్ డ్రింక్స్ తీసుకొంటావా?"

"మీ యిష్టం—" అంది కుముద.

"గుడ్—అలా అయితే కోక్ ఒకటి 'రా' గానే కొట్టేసెయ్!" అన్నాడు సుందరరావు.

"రాగానే కొడతాను. అందులో చెప్పే దేముంది!" అంది కుముద.

సుందరరావు నవ్వాడు—"రాణీ—'రా' గానే అంటే కోక్ బాటిల్ తేగానే అని కాదు. నీళ్ళు కలపకుండానే తాగేసెయ్! అని అర్థం!"

ఈసారి జోక్‌కు కుముదా నవ్వింది—అంటే భర్త తనను వేళాకోళం ఆడుతున్నా డన్నమాట! అయినా నిజంగా తానూ ఏ బ్రాందీయో, బీరో, రమ్మో తాగటానికి సిద్ధ పడితే సహించగలరా వీళ్ళు? అనుకొంది కుముద.

మగవాళ్ళది మరీ చిత్రమైన మన స్తత్వం. కొన్నికొన్ని అనుభవాలు కేవలం తమకు మాత్రమే ఉండాలని పట్టుపడతారు. తాగటం, పొగ తాగటం, పరస్త్రీ అనుభవం...ఇవన్నీ పురుషులుగా వాళ్ళ ప్రత్యేక హక్కులు అని వాళ్ళ అభిప్రాయం. మగాణ్ణి దెబ్బకొట్టాలంటే యిలాటి హక్కు ఏ ఒక్కటి కోరినా చాలు—చిత్తయిపోతాడు అనుకొంది కుముద.

అయినా కుముద ఈరోజు భర్తను దెబ్బ కొట్టటానికి రాలేదు. ఆమెకు బార్ అంటే ఉండే ప్రత్యేకమైన ఆసక్తి ఆ రోజు ఆమెను అక్కడికి లాక్కొచ్చింది. తాగాలని, తినాలని కోరిక కాదది. ఆ వాతావరణాన్ని పరిశీలించా లని, ఆ వాతావరణంలో ఉండే మత్తు ఏమిటో అర్థం చేసుకోవాలని ఆమె తాపత్రయం.


తను ఆ వాతావరణాన్ని పరిశీలించాలని వచ్చింది కానీ ఆ వాతావరణమే తన్ను పరి శీలిస్తోందన్న సంగతి కుముదకు తెలీని సంగతి కాదు—గ్లాసెత్తినప్పుడు కొందరు ఓరకంట చూస్తున్నారు. చూస్తే బాగుండదేమోనన్న సంశయంతో బాధపడుతున్నారు కొందరు. మరికొందరు అలా ఏమీ కాక - ధైర్యంగా తన్నే చూస్తున్నారు, కుముదకు ఆ చూపులన్నీ తన ఒంటిని తడిమి చూస్తున్నట్లుగా తోచింది. అయినా - ఇలాటిచోట తను మరీ ముడుచు కొని కూర్చున్నా బాగుండదు అనుకొంది.

బేరర్ వచ్చి ప్లేట్లు, గ్లాసులు అవీ సర్ది సీసాలోంచి ద్రవాన్ని గ్లాసులో పోశాడు. కుముద ముందు పెట్టిన గ్లాసులో కోక్ పోశాడు.

సుందరరావు గ్లాసెత్తి 'ఛీర్స్' అన్నాడు.

కుముద నవ్వింది - 'ఛీర్స్, చీర్సే కాని వ్వండి!' అంది.






సుందరరావు చిన్నగా నవ్వి ద్రవాన్ని నోటి లోకి జార్చుకొన్నాడు. కుముదకు బాధ కల గింది. పెళ్ళయిన కొత్తరోజుల్లోనే కుముదకు భర్త తాగుతాడని తెలిసింది. తాగటం పెద్ద తప్పేమీ కాదు. మద్యమాంసాలు ఈ రోజుల్లో ఫ్యాషన్‌గానూ, స్టాటస్ సింబల్స్‌గానూ మారి పోయాయి. 'ఫ్రెండ్స్ అంతా తాగుతోంటే వద్దనటానికి వీల్లేకపోయింది' అనే వంకతో చే భర్తల తాగుడు కథలు ఆరంభమవుతాయి. సుందరరావు సంగతీ అంతే! - తనూ పెద్దగా పట్టించుకోలేదు. 'తాగదు' అని చెప్పినా పెద్ద ఫలితం ఉండదని తెలిసినపుడు ఇక ఆ పయాసా అనవసరం.

బార్ అంతా కోలాహలంగా వుంది.

—గ్లాసుల గలగలలు.

మనుషుల పతనాలు.

స్ప్రింగ్ డోర్ తెరుచుకొంది మళ్ళీ - తనకు తోడుగా ఈ బార్‌లోకి మరో స్త్రీ కూడా వచ్చింది. కుముదకు ఆశ్చర్యం కలిగింది.

"ఇంకొకళ్ళు ఎవరో వస్తున్నారండీ!" అంది కుముద, సుందరరావుతో.

సుందరరావు కళ్ళు చికిలించుకొని చూశాడు - ఎవరో ఓ జంట.

"బార్ అంటే లక్షరకాల జనం వస్తుంటారు- తాగు - మన పని మనం చేసుకొనిపోవటం మంచిది" అన్నాడు సుందరరావు.

కుముద మనసులో ఎన్నో ప్రశ్న లున్నాయ్ - బార్‌కు వచ్చేవాళ్ళు సాధారణంగా అలవాటు పడ్డవాళ్ళే అయిఉంటారా? లేకపోతే అప్పుడప్పుడువచ్చేవారే ఎక్కువా? రోజూ వచ్చి ఇలా డబ్బును నీళ్ళ పాలనో, సోడా పాలనో ఖర్చుచేసి పోయేంత స్తోమత ఇక్కడ అందరికీ ఉంటుందా? - ఇలా రోజూ ఖర్చు పెట్టేస్తోంటే ఇంట్లోవాళ్ళ సంగతి ఏమిటి??—తనలాగ ఇలా వాతావరణ పరిశీలనకు అందరూ రావ టానికి ఉత్సాహపడతారా?

—ఏమో!

అన్నీ ప్రశ్నలే!

తను ఈ ప్రశ్నల్లో కొన్నిటికి జవాబు ఊహించుకోగలదు. మరికొన్నిటికి జవాబు తనకే తెలుసు. ఇక కొన్నిటికి — సుందర రావుకు తెలిసినా - చెప్పడు.

అందుకే కుముద ఊర్కొంది. కానీ బార్ లోకి వచ్చిన అమ్మాయిని కుతూహలంతో పరిశీ

ప్రస్తోనే వుంది — ఆ అమ్మాయికి ఇరవై నుంచి ముప్పైలోపు ఎంతైనా ఉండొచ్చు వయస్సు. మనిషి అందంగా ఉన్నట్లే లెక్క. ఎక్కడి వంపులు అక్కడ ఖచ్చితంగా వంపు తిరిగి ఉన్నాయి. ఒక్కసారి చూస్తే మరోసారి చూడాలనే కోరిక కలిగిస్తోంది. కుముదకు ఆ అమ్మాయి అంటే ఈర్ష్య కలిగింది — బాధ కలిగింది.

ఈర్ష్య - ఆ అమ్మాయి తనకన్నా 'అందం'గా ఉన్నందుకు !!

బాధ - ఆ అమ్మాయీ తనలాటి బాధనే అనుభవిస్తున్నందుకు !!—

ఉండబట్టలేక అనేసింది కుముద పైకి - "అంత మంచి అమ్మాయి ఉండగాకూడా ఇంకా ఈ వెధవ వేషాలు ఎందుకూ?"

సుందరరావు నవ్వాడు - "అంటే, తాగటం నీ లెక్కలో వెధవ్వేషం అయిందన్నమాట !!"

"ప్రపంచంలోకెల్లా బాగా మత్తెక్కించేది ఆడదే కదా! అందులోనూ అందమైన ఆడదే భార్యగా వుండగా ఇంకా ఈ బార్లూ, బీర్లూ ఎందుకు?"

సుందరరావు ఇంకొంచెం గట్టిగా నవ్వాడు - "ఆ అమ్మాయి అతని భార్య కాదు!" అన్నాడు.

కుముద, సుందరరావుకేసి జుగుప్సగా చూసి అంది, "మీకు తెలుసా? ... అయినా అందమైన ఆడదాన్ని ఏ పరాయివాడి భార్యగానో మీరెందుకు ఒప్పుకొంటారు లెండి!"

"కుముదా! - ఆ అమ్మాయి అతని భార్య కాదు. ఆ అమ్మాయి ఇక్కడ టాక్సీ!"

"టాక్సీయా? అంటే? — " అనడిగింది కుముద.

"నీకు తెలీనివి ప్రపంచంలో లక్ష ఉన్నాయి. బార్‌లోకి ఎవరైనా ఎప్పుడొస్తారు?"

"కారణాలా? బోలెడు చెప్తాను. అన్నీ మీరు చెప్పేవే - ఒకరోజు మూడ్ బాగుండక. ఇంకోరోజు జలుబు చేసి. ఇంకోరోజు ఎరియర్స్ బిల్ పాసయి. మరో రోజు ఏమీ తోచక. తర్వాతరోజు బిల్ పాసయి ..., ఒక్కోసారి తాగాలనిపించి, ఒక్కోసారి ఇకపై తాగకూడదని నిర్ణయించుకొనే ముందు సెలబ్రేట్ చేసుకొంటూ..." సుందరరావు కుముద కాలిని నొక్కాడు, నోరు మూస్తావా అన్నట్లు.

"అవి కాదు. ఏదో మనశ్శాంతి వెతుక్కొంటూ వస్తారు."

"మనశ్శాంతి సీసాల్లో దొరుకుతుందా? పాపం, మన పూర్వీకులంతా హిమాలయాల్లో పడి ముక్కుమూసుకొని కళ్ళు తెరచుకొని క్రిందామీదా పడి దానికోసం తెగ వెతికారు. వాళ్ళకాసంగతి తెలీలేదు కాబోలు!"

"కుముదా - క్షణం వుంటే నీ జోక్కు నవ్వుతా కానీ, ఆవిడమాత్రం ఇక్కడ టాక్సీ. తాగటానికి వచ్చినపుడు కూడా కంపెనీ ఎవరైనా ఉంటేనే బాగుంటుంది ఎవరూ లేరనుకో, అపుడు మనం టాక్సీలను వెతుక్కోవచ్చు!"

"అంటే? - నాకు అర్థం కావటంలేదు!"


"పిల్ల - అమ్మాయిలు - అద్దెకు దొరుకుతారు. కేవలం కంపెనీవరకే సుమా! పిల్లలు ఒంటరిపక్షులకు తాగేందుకు తోడుంటారు. వాళ్ళ తాగుడు ఖర్చు అంతా భరిస్తే చాలు. తాగినంతసేపు కూడావుంటారు. వాళ్ళతోబాటు మనం జోక్స్ వేసుకోవచ్చు. సరదాగా మాట్లాడుకోవచ్చు. ఎటొచ్చీ అసభ్యంగా ప్రవర్తించే వీలులేదు."

"బాగుంది జోకు! - అద్దెకొచ్చే అమ్మాయితో అసభ్యప్రవర్తన పనికిరాదట! మంచి జోకే!!" అంది కుముద నవ్వేస్తూ.

"నమ్ము, నమ్మకపో - నీ ఇష్టం. కానీ నిజం అది! అయితే ఆ అమ్మాయితో మాట్లాడుకొనేటపుడు మిగతావాటికి కూడా ఒప్పందం కుదిరితే వేరు. కానీ సాధారణంగా పిల్లలు అలాటి వాటికి ఒప్పుకోరు. తాగేంతవరకే కంపెనీ - ఆ తర్వాత - ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు...!"

"అవును కానీ - ఇలాటి వివరాలన్నీ మీకెలా తెలుస్తాయండీ? కొంపదీసి మీరెప్పుడైనా కంపెనీతోబాటు దుకాణం పెట్టారా ఏమిటి






ఒప్పందం కుదుర్చుకొని?"

"ఛా, ఛా. అలాటిదేమీలేదు! - "

"నిజం?"

"నిజమే! — నీమీద ఒట్టు! - "

"సర్లెండి, ఒట్టుకూడా నామీద! అదీ తాగినపుడు! మద్యం, మాంసం - పనికి వచ్చినపుడు మూడో 'మ' - అదే మగువ ఎందుకు పనికి రాదు అని!"

సుందరరావు నవ్వాడు - "ఎందుకు పనికి రాదు అని అడక్కు! పనికివస్తుంది. కానీ కుముద వుంది కదా ఇంకెందుకా గొడవలన్నీ అని!"

కుముద నవ్వేసింది - "తాగినపుడు ఎన్ని అబద్ధాలైనా ఆడతారన్నమాట మీరు!"

"ప్రేమ్‌నగర్‌లో నాగేశ్వరరావు ఏమన్నాడో తెలుసా? - తాగినవాడు నేలమీద నిలబడడు, మాటమీదే నిలబడతాడు అని!"

"కానీండి. అన్ని అబద్ధాలలో ఇదొకటి! -"

—కుముద మనసంతా ఆ అమ్మాయిమీదే వుంది. భర్త చెప్పింది నిజమవునా కాదా అనే ఆలోచిస్తోంది. పరీక్షిస్తోంది. కానీ ఆ అమ్మాయి ప్రవర్తనలో ఎబ్బెట్టుగా ఏదీ కనపడ్డంలేదు. ఆ అమ్మాయిని టాక్సీలాగ ఊహించుకోవటానికి కుముద మనసు అంగీకరించలేదు.

"అవునూ - మీరు చెప్పారు కదా - ఇలాటి వాళ్ళని టాక్సీలంటారు అని! మరి జనం ఎక్కకూడని టాక్సీలు ఏమిటండీ బాబూ?"

సుందరరావుకు నవ్వొచ్చింది — "నిజమే సుమా! ఎక్కకూడని టాక్సీ ఏమిటి? ప్రైవేట్ కార్ అనాలి కానీ - అదీ తప్పే ... పబ్లిక్ ప్రైవేట్ కార్ ... ఉహూ - సరైన పేరు టాక్సీయే లెద్దూ! - అవునూ - తాగింది నేను కదా, నిషా నీకు ఎక్కుతోందేం?"

"నేను మీ అర్ధాంగిని కదా! అందుకేమో!" - అంది కుముద.

---సుందరావు పర్సులోంచి డబ్బు తీసి ప్లేట్‌లో పడేసి, లేచాడు.

"అమ్మయ్య, ఈ రోజుతో నీ కోరిక తీరినట్లే కదా!"

కుముద నెమ్మదిగా అంది — "బాగుంది, రామాయణం అంతా విని రాముడికి సీత ఏమవుతుందన్నట్లుగా వుంది. నా కోరిక నేను బార్‌కు

రావటం కాదు, మీరు రాకుండా వుండటం?"

"ఆ కోరిక తీరదు కుముదా!" - అన్నాడు సుందరరావు కుముదతో!

భర్తకు నిషా పూర్తిగా ఎక్కింది అనుకొంది కుముద

*  *  *

కుముద ఆ బార్‌కు వచ్చివెళ్ళిన వారం రోజుల తర్వాత -

- ఆ రోజే మళ్ళీ సుందరరావు ఆ బార్‌కు రావటం!

అలవాటైన ప్రాణం, అలవాటైన బార్ - అలవాటుకొద్దీ సుందరరావు తను కూర్చునే టేబుల్ దగ్గర కూర్చున్నాడు.

బేరర్ వచ్చి ఆర్డర్ తీసుకెళ్ళాడు?

అపుడే ఒక కుర్రాడు - మహా ఉంటే పాతికేళ్ళ వుంటాయేమో - వచ్చి సుందరరావు ఎదురుగా కూర్చుంటూ - "ఎక్స్‌క్యూజ్ మీ, కూర్చోవచ్చా ఇక్కడ!" అనడిగాడు.

"కూర్చోండి, నాకేం అభ్యంతరం లేదు!" అన్నాడు సుందరరావు.

అతను సెటిలవుతూ అన్నాడు: "నా పేరు వేణుగోపాల్! రైల్వే ఆడిట్‌లో పనిచేస్తున్నాను!"

"ఐసీ-" అన్నాడు సుందరరావు! తర్వాత తన వివరాలూ చెప్పాడు.

"మీరెప్పుడొస్తారా అని వారంరోజులనుంచీ చూస్తున్నాను!"

"అదేం? ఏమైనా పని వుందా?" ఆశ్చర్యంగా అడిగాడు సుందరరావు.

"పనా? .... పని అంటే పనికాదు అనుకోండి. అలా అని పనికాదు అనీ చెప్పలేం!"

సుందరరావు నవ్వాడు - అతని పద్ధతికి, ఆ తడబాటుకీ.

"ఇంతకీ అసలు సంగతి - వారం రోజుల క్రిందట మీతో ఎవరో టాక్సీ వచ్చింది కదా! ఆమె అడ్రసు కనుక్కుందామని!"

—సుందరరావు షాక్ తిన్నాడు. వారం రోజుల క్రిందట .... కుముద! - తన భార్య!!

"నాకు అలాటి ఫామిలీ టైప్స్ అంటేచాల ఇష్టం సార్! కంపెనీకి కంపెనీ బాగుంటుంది. మనకూ బాగానే వుంటుంది. పైగా ఆ పిల్ల మంచి సెక్సీగానూ వుంది - మీరు కొంచెం అడ్రస్ చెబితే....!—

సుందరరావుకు మతిపోయింది - ఎదురుగా ఎవడో తెలేని వెధవ. 'నీ భార్య మంచి సెక్సీగా వుంటుంది' అంటున్నాడు, చాచిలెంపకాయ కొట్టాలనుకున్నాడు,

కానీ - కొట్టలేదు,

తప్పతనిది కాదు - అతను తాగి వున్నాడు

తాగటమూ తప్పుకాదు, అది మనశ్శాంతిని కలిగిస్తోంది. మరి—

తప్పు ఆడదాన్ని కొనుక్కోగలమనే ధీమా అందరిలోనూ కలిగిస్తున్న వ్యవస్థది!

—సుందరరావు లేచాడు, బేరర్ యింకా ఓపెన్ చెయ్యని బాటిల్స్ టేబిల్‌మీద పెడుతోంటగానే వద్దంటూ జేబులోంచి పర్సు తీసి డబ్బు అందించాడు - "బిల్లు కట్టేసి, మిగిలింది నువ్వు ఉంచుకో!

బేరర్ వెళ్ళిపోయాక సుందరరావు వేణుగోపాల్‌కేసి చూస్తూ అన్నాడు: "మొన్న వారంరోజుల క్రిందట ఇక్కడకు వచ్చింది - నా భార్య! టాక్సీ కాదు!"

వేణుగోపాల్ ఉలిక్కిపడ్డాడు, ఏదో చెప్పాలని లేచాడు.

కానీ—

అప్పటికే సుందరరావు స్ప్రింగ్ డోర్ తీసుకొని వెళ్ళిపోయాడు బయటికి,

—వేణుగోపాల్ తర్వాత 'సారీ' చెప్పటానికి సుందరరావుకోసం ప్రతి బార్‌లోనూ వెతుకుతూనే ఉన్నాడు. కానీ వేణుగోపాల్‌కు సుందరరావు ఆ తర్వాత యెక్కడా కనపడలేదు.

—తన భర్త అంత హఠాత్తుగా తాగటం ఎందుకు మానేశాడో మాత్రం కుముదకు అంతుపట్టలేదు. తెలివైన ఆడది కాబట్టే కారణం అడిగే ప్రయత్నం చెయ్యలేదు.



